సాక్షి
పశ్చిమగోదావరి

సోమవారం । 2 । డిసెంబర్ । 2024



అటకెక్కిన రీ సర్వే

గత ప్రభుత్వంలో భూముల రీ సర్వేలో జిల్లా రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో ఉండగా కూటమి ప్రభుత్వంలో సర్వే పూర్తిగా నిలిచిపోయింది. 8లో



ఆక్వా హడల్

బంగాళాఖాతంలో ఏర్పడిన ఫెంగల్ తుపాను ప్రభావం ఆక్వా రంగంపై పడింది. వర్షాలతో ఆక్వా రైతులు ఆందోళన చెందుతున్నారు. 8లో



డ్రోన్ కలకలం

ద్వారకాతిరుమల చిన వెంకన్న క్షేత్రంలో డ్రోన్ కలకలం రేగింది. ఓ యూట్యూబర్ డ్రోన్‌తో తీసిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. 8లో

చివరిలో తుపాను వణుకు

ఫెంగల్ గుబులు

- వంటను కాపాడుకునేందుకు రైతులు ఉరుకులు పరుగులు
- 2 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ సాగు
- 45 శాతం విస్తీర్ణంలో చేలల్లోనే పంట
- నష్టనివారణ చేపట్టాలంటున్న శాస్త్రవేత్తలు



ఫెంగల్ ముం'చేను'.. నరసాపురం మండలం కొప్పర్రులో నేలకొరిగిన వరి పొలం

సాక్షి, భీమవరం: ఆరుగాలం శ్రమించి పండించిన పంట చేతికందే సమయంలో ఫెంగల్ తుపాను కర్షకులకు కంటిమీద కునుకులేకుండా చేస్తోంది. జిల్లాలో రెండు లక్షల ఎకరాల్లో ఖరీఫ్ సాగు చేశారు. 55 శాతం విస్తీర్ణంలో వరి కోతలు పూర్తయ్యాయి. 4.1 లక్షల టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం కాగా ఇప్పటివరకు 1.45 లక్షల టన్నుల ధాన్యం సేకరించారు. అధిక శాతం ధాన్యం పొలాలు, కల్లాల్లోనే ఉంది. ఈ దశలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు రైతులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ధాన్యం తడవకుండా కాపాడుకునేందుకు రైతులు ఉరుకులు పరుగులు పెట్టాల్సి వస్తోంది. ముందుగా వరి కోతలు పూర్తయిన తాడేపల్లిగూడెం, తణుకు ప్రాంతాల్లో రైతులు దాళ్వా కోసం నారుమడులు సిద్ధం చేసుకుంటున్నారు.

నష్టనివారణ తప్పనిసరి

ప్రస్తుత తరుణంలో కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా పంట నష్టాన్ని నివారించవచ్చునని మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త టి.శ్రీనివాస్ తెలిపారు. వివిధ దశల్లో చేపట్టాల్సిన నష్టనివారణ చర్యలు గురించి వివరాలు ఆయన మాటల్లోనే..

- కోతకి సిద్ధంగా ఉన్న వరి పంటను వర్షాలకు ముందు కోయరాదు.
- కోసిన పూర్తిగా ఆరని పనలను తుపాను వాతావరణ నేపథ్యంలో కుప్పలు వేసేటప్పుడు ఎకరాకు 25 కిలోల ఉప్పును పనలపై చల్లుకుంటూ కుప్ప వేసుకోవడం వల్ల నష్టాన్ని నివారించుకోవచ్చు.
- తడిసిన పనలపై మొలకలు రాకుండా ఐదు శాతం ఉప్పు ద్రావణాన్ని పనలపై పడేలా పిచికారీ చేయాలి. ఒక వేళ పొలంలో నీరు నిలిచి ఉంటే పనలను గట్ల పైకి తెచ్చుకొని విడగొట్టి ఉప్పు ద్రావణం చల్లుకోవాలి. వర్షాలు తగ్గి ఎండ రాగానే పనలను తిరగేసి ఎండబెట్టి నూర్చుకోవాలి.
- ఎండ కాసిన తర్వాత ధాన్యాన్ని ఎండబోసి, తూర్పార బట్టి నిల్వ చేసుకోవాలి.
- రంగు మారి, తడిసిన ధాన్యం పచ్చి బియ్యం కంటే ఉప్పుడు బియ్యంగా అమ్ముకోవడం వల్ల నష్టాన్ని కొంతవరకు తగ్గించుకోవచ్చు.
- పొట్ట, పూత దశలో పైరు రెండు రోజులకు పైగా నీట మునిగితే కంకి పూర్తిగా బయటకు రాకపోవడం, పుష్పాల్లో నీరు చేరడం వలన ఫలదీకరణ శక్తి కోల్పోయి తాలు, రంగు మారిన గింజలు ఏర్పడతాయి. గింజ రంగు మారకుండా ఉండటానికి లీటరు నీటికి ఒక గ్రాము కార్బెండిజం లేదా రెండు గ్రాముల కార్బెండిజం, మాంకోజెబ్ లేదా 1 మి.లీ ప్రోపికొనజోల్ మందును పిచికారీ చేయాలి.

- కల్లాల మీద ఉన్న ధాన్యాన్ని వర్షానికి తడవకుండా భద్రపరుచుకోవాలి. నూర్చిన ధాన్యం 2–3 రోజులు ఎండ బెట్టడానికి వీలు కాకపోతే కుప్పల్లో గింజ మొలకెత్తడమే కాక రంగు మారి చెడు వాసన వస్తుంది. ఇటువంటి పరిస్థితుల్లో నష్టాన్ని నివారించడానికి క్వింటాలు ధాన్యానికి కిలో ఉప్పు, 20 కిలోల పొడి ఊక కలిపి ధాన్యం పోగు పెట్టడం వల్ల గింజ మొలకెత్తకుండా, చెడిపోకుండా నివారించవచ్చు.

- **పాలు పోసుకునే దశలో రెండుమూడు రోజుల కన్నా ఎక్కువగా నీట మునిగితే పిండి పదార్థాలు గింజల్లో చేరక గింజ బరువు తగ్గి రంగు మారి, తద్వారా దిగుబడి నాణ్యత తగ్గుతాయి. గింజ రంగు మారకుండా ఉండటానికి లీటరు నీటికి ఒక గ్రాము కార్బెండిజం లేదా రెండు గ్రాముల** కార్బెండిజం, మాంకోజెబ్, లేదా 1 మీ.లీ ప్రోపికొనజోల్ మందును పిచికారీ చేయాలి.

- గింజ గట్టిపడే దశ నుంచి కోత దశ వరకు చేను పడిపోకుండా ఉండి, నిద్రావస్థ కలిగిన రకాలలో నష్టం తక్కువగా ఉంటుంది. నిద్రావస్థ లేనటువంటి బీపీటీ 5204 వంటి రకాలు నీటమునిగితే గింజ మొలక వచ్చి నష్టం ఎక్కువగా ఉంటుంది. నిద్రావస్థ ఉన్న రకాల్లో కూడా చేను పడిపోయి ఎక్కువ రోజులు నీట మునిగినట్లైతే గింజల్లో నిద్రావస్థ తొలిగి చేనుపైనే మొలకవచ్చే అవకాశం ఉంది. దీని నివారణకు ఐదు శాతం ఉప్పు ద్రావణాన్ని చేనుపై పిచికారీ చేయాలి.

- గింజ తోడుకునే లేదా గట్టిపడే దశలో వెన్ను బరువు వలన మొక్కలు కొద్దిపాటి గాలి, వర్షాలకే కణుపుల వద్ద విరిగి నేలకి ఒరుగుతాయి. ఇలా పడిపోవడం వల్ల పిండి పదార్థం గింజలకు సరిగా చేరక గింజ బరువు తగ్గడం లేదా తాలు గింజలు ఏర్పడి దిగుబడి తగ్గుతుంది. పడిపోయిన చేలలో యంత్రాలతో కోత కోయడానికి ఎక్కువ సమయం పట్టడం వల్ల కోతఖర్చు పెరిగిపోతుంది. నష్ట నివారణ కోసం పడిపోయిన చేలల్లో వీలైనంత తొందరగా దుబ్బులను లేపి నిలబెట్టి కట్టలుగా కట్టుకోవాలి.
- దాళ్వా నారు మడి దశలో ఉన్న వరి పంట, విత్తనం చల్లిన 2–3 రోజుల వయసులో ఉన్నప్పుడు, మూడు రోజుల కన్నా ఎక్కువ నీట మునిగితే మొలక శాతం గణనీయంగా తగ్గుతుంది. ఈ దశలో వీలైనంత తొందరగా నీటిని **పూర్తిగా బయటకు తీసివేయడం వల్ల విత్తనం కోర గాలిపోసుకొని ఎటువంటి నష్టం జరగదు. అలా కాక నీరు తీయడానికి వీలు లేక మొలక దెబ్బతింటే తిరిగి విత్తనం చల్లుకోవాల్సిన అవసరం ఏర్పడుతుంది.**
- **విత్తిన వారం నుంచి నెల రోజుల మధ్యలో** నారుమడి 5 రోజుల కన్నా ఎక్కువగా నీట మునిగితే నారు దెబ్బతినే అవకాశం ఉంది. నారు నీట మునిగిన 5 రోజుల్లోపు, నీటిని పూర్తిగా బయటకు తీసివేసి పంటకు గాలి తగిలేలా చేయాలి. నష్టనివారణకు నీటిని తీసివేసిన తర్వాత 5 సెంట్ల నారుమడికి కిలో యూరియా, కిలో మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేయడం వలన కొత్త ఆకు వచ్చి ఊడ్పులకు అందుతుంది.
- అధిక వర్షాలకు నారు మడి దశలో పంట తెగుళ్ల బారిన పడకుండా, నీరు పూర్తిగా తీసివేసి మొక్క నిలదొక్కుకున్న తర్వాత లీటరు నీటికి ఒక గ్రాము కార్బెండిజం, లేదా రెండు గ్రాముల కార్బెండిజం, మాంకోజెబ్ కలిపి పిచికారీ చేయాలి.
- పంట ఊడ్చిన వెంటనే, పిలక దశలో ముంపునకు గురైతే, నీటిని పూర్తిగా బయటకు తీసివేసి తరువాత పైపాటుగా ఎకరాకు 20 కిలోల యూరియా, 20 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ అదనంగా వేసుకోవాలి. ఇలా బూస్టర్ డోస్ వేసుకోవడం వలన మొక్క ముంపు ప్రభావం నుంచి త్వరగా కోలుకుంటుంది. మొక్క కోలుకున్న తర్వాత కుళ్లు తెగుళ్ల రాకుండా లీటరు నీటికి ఒక గ్రాము కార్బెండిజం కలిపి పిచికారీ చేయాలి.
- పొలంలో నిల్వ ఉన్న నీరు మురుగు కాలువల ద్వారా బయటకు వెళ్లేలా బాటలు ఏర్పాటు చేసుకోవాలి.



టి.శ్రీనివాస్
ప్రధాన శాస్త్రవేత్త

ఇసుకాసురుల దందా

- రీచ్‌ల వద్ద అక్రమాల పర్వం
- ప్రైవేట్ వ్యక్తి ద్వారా ట్రక్కుకు అదనపు వసూలు
- మంత్రి మాటలు బుట్టదాఖలు



యల్లాపురంలో ఇసుక ట్రాక్టర్ యజమాని నుంచి రహస్యంగా నగదు వసూలు చేస్తున్న ప్రైవేట్ వ్యక్తి

ముసునూరు: మండలంలోని వలసపల్లి, యల్లాపురం ఇసుక రీచ్‌ల వద్ద అక్రమ వసూళ్ల పర్వం యథేచ్ఛగా సాగుతోంది. అక్రమ ఇసుక రవాణా సహించం, నియమిత వేళల్లోనే తోలకాలు, లోడింగ్ చార్జీ రూ.400 మాత్రమే, సీనరేజ్ లేదు, ఇసుక కోసం ఒక్క రూపాయి కూడా కట్టనవసరం లేదు, పూర్తిగా ఇసుక ఉచితం, లేదంటే వాహనాలన్నింటినీ సీజ్ చేస్తాం, పీడీ యాక్ట్ అమలు చేస్తామన్న రాష్ట్ర మంత్రి మాటలు బుట్టదాఖలు అయ్యాయి.

ఒక్కో రేవులో ఒక్కోలా..

వలసపల్లి, యల్లాపురం రేవులతోపాటు తమ్మిలేరు పరివాహక గ్రామాలైన లోపూడి, గుళ్లపూడి, గుడిపాడు, బలివే, వెంకటాపురం గ్రామాల్లోని రేవుల నుంచి వందలాది ట్రాక్టర్లతో ఇసుక తరలుతోంది. ఆయా రేవుల వద్ద ప్రైవేట్ వ్యక్తులను ఏర్పాటు చేసి, వారి ద్వారా రూ.100 చొప్పున అక్రమంగా వసూలు చేస్తున్నారని యజమానులు, డ్రైవర్లు, ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో రహదారి పక్కన వసూళ్లు చేయగా, మీడియా కథనాలతో ఇప్పుడు రేవులోనే లోడైన మరుక్షణం వసూలు చేస్తున్నారని ట్రాక్టర్ యజమానులు అంటున్నారు.

లోడింగ్ చార్జీలు సైతం పెంపు

లోడింగ్ చార్జీలు రూ.400 మాత్రమేనని మంత్రి చెప్పినా రూ.500 వసూలు చేస్తున్నారు. మెత్తని ఇసుక కావాలంటే మరో రూ.50 లేదా రూ.100 అధికంగా వసూలు చేస్తున్నారని ట్రాక్టర్ యజమానులు అంటున్నారు. దీంతో ఉచిత ఇసుక ఖరీదైన వనరుగా మారిందని వాపోతున్నారు. మరికొందరు తమ పలుకుబడి ఉపయోగించి, సొంత ట్రాక్టర్లు అన్నింటితో రీచ్‌ల నుంచి ఉచితంగా ఇసుక సేకరించి, సమీప పట్టణాల్లో వ్యాపారులకు ట్రక్కు ఇసుక రూ.6 వేల నుంచి రూ.8 వేల వరకు అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నట్టు స్థానికులు ఆరోపిస్తున్నారు. దీనిపై తహసీల్దార్ రాజ్‌కుమార్‌ను వివరణ కోరగా మళ్లీ అధిక వసూళ్లు చేస్తున్నారనే విషయం తమ దృష్టికి రాలేదని, సోమవారం రీచ్‌లకు సిబ్బందిని పంపి, చర్యలు చేపడతామని చెప్పారు.

మోసం చంద్రబాబు నైజం

- విద్యుత్ చార్జీలు పెంచబోమని, ఎన్నికల్లో హామీలు
- ఇప్పుడు ట్రూఅప్ చార్జీల పేరుతో రూ.15 వేల కోట్లకు పైగా భారం
- బాబు ష్యూరిటీ ఎలాగున్నా... బాదుడు మాత్రం గ్యారంటీ అయ్యింది
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు ధ్వజం



నరసాపురం: మోసం, వంచన అనే పదాలకు పూర్తి పేటెంట్ హక్కులు ముఖ్యమంత్రి చంద్రబాబువే అన్నట్టుగా మరోమారు తేటతెల్లమయ్యిందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు విమర్శించారు. తాము అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు ఒక్క రూపాయి కూడా పెంచబోమని అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన చంద్రబాబు ట్రూఅప్ చార్జీల పేరుతో ప్రజల నడ్డి విరుస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. నరసాపురంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన ఆరు నెలల్లో ట్రూ అప్ చార్జీల పేరుతో ప్రజలపై మొత్తం రూ.15,485.36 కోట్ల భారం వేశారని చెప్పారు. అధికారంలోకి వచ్చిన వెంటనే దీపావళి కానుకగా మొదటిసారి వేసిన రూ.6,072.86 కోట్ల ట్రూ అప్ చార్జీలతోనే ఇంకా ప్రజలు సతమతమవుతుంటే తాజాగా రెండోసారి డిసెంబర్‌కు సంబంధించి రూ.9,412.50 కోట్ల భారం మోపుతూ విద్యుత్ చార్జీలు పెంచుతున్నారని విమర్శించారు. జనవరి నుంచి వచ్చే కరెంట్ బిల్లులు చూసి ప్రజల గుండెలు అదిరిపోతాయన్నారు. ఇది బాదుడు ప్రభుత్వమే కానీ, ప్రజల బాగు కోరే ప్రభుత్వం కాదని మరోసారి రుజువైందని మండిపడ్డారు. ఇంధన సర్దుబాటు చార్జీల భారం ప్రజలపై వేయడం ఏమిటని ఈ సందర్భంగా ఆయన ప్రశ్నించారు. ఆ ఖర్చు ప్రభుత్వమే పెట్టుకోవాలని డిమాండ్ చేశారు. చార్జీల పెంపునకు డిస్కంలకు ఇప్పటికే అనుమతి ఇచ్చిన ప్రభుత్వం ఏమీ తెలియనట్టు, అసలు విద్యుత్ చార్జీలు పెంచనట్టు నటించడం దారుణమన్నారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు తాను అధికారంలోకి వస్తే కరెంట్ చార్జీలు పెంచబోనని, అవసరమైతే తగ్గిస్తానని ఊదరగొట్టారని ముదునూరి అన్నారు.

సూపర్ సిక్స్ అమలేదీ..

ఎన్నికల్లో అబద్ధపు హామీలు ఇచ్చి గద్దెనెక్కిన చంద్రబాబు సూపర్ సిక్స్ అమలుపై నోరు మెదపడం లేదని ప్రసాదరాజు విమర్శించారు. ఆర్భాటంగా ప్రారంభించిన ఉచిత గ్యాస్ పథకం కూడా అందరికీ అందడం లేదన్నారు. ఉచిత ఇసుక ఎక్కడా దొరకడం లేదన్నారు. అమ్మఒడి వంటి పథకాలను అటకెక్కించారని విమర్శించారు. గ్రామగ్రామానా సందుకో బెల్టుషాపు పెట్టి రాష్ట్రాన్ని మద్యాంధ్రప్రదేశ్‌గా మార్చేశారని విమర్శించారు. ప్రజల దృష్టి మరల్చేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో తక్కువ ధరకు చేసుకున్న విద్యుత్ కొనుగోళ్ల ఒప్పందాలపై తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. మొదటి నుంచి వ్యూహాత్మకంగా జగన్ సర్కార్‌పై చంద్రబాబు తప్పుడు ప్రచారం, విష ప్రచారం చేశారన్నారు. పప్పులు, ఉప్పులు, కూరగాయల ధరలు జగనే పెంచేస్తున్నారని దుష్ప్రచారం చేశారని ధ్వజమెత్తారు. ఈ ఆరు నెలల్లో పప్పులు, బియ్యం, కూరగాయల ధరలు ఎంతలా పెరిగాయో ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం నుంచి పథకాల రూపంలో ఎలాంటి ఆర్థిక సహకారం లేక, మరోవైపు పెరిగిన ధరలతో ఖర్చులు పెరిగిపోయి ప్రజలు అప్పుల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే 'బాబు ష్యూరిటీ.. బాదుడు వీర గ్యారంటీ' అనే అభిప్రాయానికి ప్రజలు వచ్చేశారని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీల అమలుపై దృష్టిపెట్టాలని ముదునూరి ప్రసాదరాజు డిమాండ్ చేశారు.

సేవలు అత్యుత్తమం.. పురస్కారం సొంతం

- తణుకు సేఫ్‌కేర్ సెంటర్‌కు రాష్ట్ర ఉత్తమ అవార్డు
- ఒక వైద్యుడు, ఆరుగురు సిబ్బందితో సేవలు
- ప్రైవేట్ విభాగంలో ఏలూరు ఆశ్రం ఆస్పత్రికి పురస్కారం



భీమవరంలో అవార్డు అందుకున్న తణుకు సేఫ్‌కేర్ సెంటర్ కౌన్సిలర్ శ్రీనాథ్



తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో సేఫ్‌కేర్ సెంటర్

తణుకు అర్బన్: హెచ్‌ఐవీ రోగులకు అందిస్తున్న వైద్య సేవలకు తణుకు సేఫ్‌కేర్ సెంటర్ స్టేట్ బెస్ట్ అవార్డును దక్కించుకుంది. రాష్ట్రవ్యాప్తంగా 54 సేఫ్‌కేర్ సెంటర్‌లకు సంబంధించి కొన్నిరకాల సేవల్లో తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రి ఆవరణలోని సేఫ్‌కేర్ సెంటర్ ప్రథమ స్థానంలో నిలిచి ఉత్తమ అవార్డును సాధించింది. ప్రపంచ ఎయిడ్స్ డే సందర్భంగా విజయవాడలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో తణుకు సేఫ్‌కేర్ సెంటర్ ఇన్‌చార్జి వైద్యాధికారి డాక్టర్ ఎస్.సత్తిరెడ్డి అవార్డును అందుకున్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాకు సంబంధించి 6 సెంటర్లలో ప్రభుత్వ విభాగంలో తణుకు సేఫ్‌కేర్ సెంటర్, ప్రైవేట్ విభాగంలో ఏలూరు ఆశ్రం ఆస్పత్రిలోని సేఫ్‌కేర్ సెంటర్ ఘనత సాధించాయి.

తణుకు సెంటర్ ప్రత్యేకం

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో తణుకు, ఏలూరు, ఏలూరు ఆశ్రం, భీమవరం, జంగారెడ్డిగూడెం, తాడేపల్లిగూడెం సేఫ్‌కేర్ సెంటర్లలో 23,346 మంది బాధితులు హెచ్‌ఐవీ మందులు వాడుతున్నారు. 2015 డిసెంబర్ 1న తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో సేఫ్‌కేర్ సెంటర్‌ను ప్రారంభించారు. మిగిలిన కేంద్రాలతో పోటీపడి 4,106 మంది రోగులకు ఇక్కడ ఒక వైద్యుడు, ఆరుగురు సిబ్బంది వైద్య సేవలందిస్తూ సత్వరమే మందులు పంపిణీ చేసి స్టేట్ బెస్ట్ స్థానం దక్కించుకున్నారు. సెంటర్ ద్వారా అందుతున్న సేవలను గుర్తించిన ఉన్నతాధికారులు ఇటీవల సెల్ఫ్ స్క్రీనింగ్ విధానంలో భాగంగా రోగులు నేరుగా 'మన ఆరోగ్యం మన చేతుల్లోనే' అనే నినాదంతో బీపీ పరీక్ష చేసుకోవడం, బరువు చూసుకోవడం వంటి సౌకర్యాన్ని రాష్ట్రవ్యాప్తంగా పైలెట్ ప్రాజెక్ట్‌గా తణుకు సేఫ్‌కేర్ సెంటర్‌లో ఏర్పాటుచేశారు. అంతేకాకుండా దాతల సౌజన్యంతో రోగులకు నిత్యావసరాలు, పోషకాహారం, ప్రొటీన్ బాక్స్‌లను ఉచితంగా అందజేశారు. ఇటువంటి సేవలతో విరాజిల్లుతున్న తణుకు సేఫ్‌కేర్ సెంటర్‌కు స్టేట్ బెస్ట్ అవార్డు దక్కడంపై ఆస్పత్రి వైద్యులు, పట్టణ ప్రముఖులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. దీంతోపాటు ప్రపంచ ఎయిడ్స్‌డే సందర్భంగా సెంటర్‌లో కౌన్సెలర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఎ.శ్రీనాథ్, స్టాఫ్‌నర్స్ పి.సురేఖలకు జిల్లా ఉత్తమ అవార్డులు అందాయి.

ఉమ్మడి జిల్లాలో మందులు వాడుతున్న రోగులు

కేంద్రం	రోగుల సంఖ్య
తాడేపల్లిగూడెం	5,495
భీమవరం	5,228
ఏలూరు	4,749
తణుకు	4,106
జంగారెడ్డిగూడెం	2,781
ఏలూరు ఆశ్రం	987

అవార్డు అభినందనీయం



స్టేట్ బెస్ట్ అవార్డు రావడం అభినందనీయం. జిల్లాలోని అన్ని కేంద్రాల్లో సత్వర సేవలందిస్తున్నారు. కొన్నిరకాల సేవలను పరిగణనలోకి తీసుకుని తణుకు సెంటర్‌కు ఈ అవార్డును అందజేశారు. వ్యాధిగ్రస్తులు క్రమం తప్పకుండా మందులు వాడితే జీవిత కాలం పెరుగుతుంది.

– డాక్టర్ బి.భానునాయక్, డీఎల్ఏటీఓ

సంతోషంగా ఉంది



తణుకు సేఫ్‌కేర్ సెంటర్ వైద్యవర్గాలు అందించిన ఉత్తమ సేవలకు స్టేట్ బెస్ట్ అవార్డు దక్కడం సంతోషంగా ఉంది. రోగులకు సత్వర వైద్యం అందించడంలో వారు చూపించిన చొరవ అభినందనీయం. ఒక్క వైద్యుడు, ఆరుగురు సిబ్బందితో లక్ష్యాలను ఛేదించి అవార్డును సొంతం చేసుకున్నారు.

–డాక్టర్ వెలగల అరుణ, తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రి సూపరింటెండెంట్

ప్లస్ టూ హైస్కూళ్లను కొనసాగించాలి

డీపీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీను



ఏలూరు (ఆర్ఆర్‌పేట): కనీస ప్రవేశాలు ఉన్న ప్లస్ టూ హైస్కూళ్లను కొనసాగించాలని డెమోక్రటిక్ పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు డి.శ్రీను, పి.వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సంఘ జిల్లా కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన అధ్యక్షుడు శ్రీను మాట్లాడుతూ అర్హత కలిగిన స్కూల్ అసిస్టెంట్లు పీజీటీలుగా పదోన్నతి పొందే అవకాశాలను మూసివేయవద్దని, రాబోయే రోజుల్లో ఎక్కువ అడ్మిషన్లు కలిగిన హైస్కూళ్లను జిల్లాపరిషత్ జూనియర్ కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. సమాజంలో పేద బలహీన వర్గాలకు ఉన్నత విద్యావకాశాలు కల్పించడానికి ప్లస్ టూ హైస్కూల్స్ దో హదపడతాయని, వాటిలో ల్యాబ్, లైబ్రరీ వంటి సదుపాయలను కల్పించి పోస్టులు మంజూరు చే యాలన్నారు. విద్యార్థుల సంఖ్య తక్కువనే కారణంతో మొత్తం వ్యవస్థను రద్దు చేయడం సరైంది కాదన్నారు. ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం కారుణ్య నియామకాలు జరపాలని, ఆర్థిక బకాయిలు చెల్లించాలని కోరారు. సంఘ గౌరవ సలహాదారుడు ఎం.అచ్యుత్ రావు, జిల్లా నాయకులు తలపంటి శ్రీను, ఎస్.ఆజాద్, కూరపాటి శ్రీను, ఆర్.వెంకట్, ఎన్.వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

శుభకరా.. సోమేశ్వరా



భీమవరం (ప్రకాశంచౌక్): పంచారామక్షేత్రం భీమవరం గునుపూడిలోని ఉమా సోమేశ్వర జనార్దన స్వామి వారి ఆలయంలో కార్తీక మాసం చివరి ఆదివారం, అమావాస్య కావడంతో స్వామి వారికి విశేష అభిషేకాలు, పూజలు జరిగాయి. ప్రధాన అర్చకుడు చెరుకూరి రామకృష్ణశర్మ నేతృత్వంలో పూజాదికాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. క్షేత్రానికి పలు రూపాల్లో మొత్తంగా రూ.1,04,679ల ఆదాయం వచ్చినట్టు ఈఓ డి.కృష్ణంరాజు తెలిపారు. అన్నదానం ట్రస్టు ద్వారా 3,500 మంది భక్తులకు అన్నప్రసాదం అందించామన్నారు.

ఎయిడ్స్‌ను పారదోలుదాం



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్

భీమవరం : ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా ఆదివారం భీమవరం ఏఆర్‌టీ సెంటర్, మండల న్యాయ సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో భీమవరం ప్రభుత్వాస్పత్రిలోని ఆవరణలో ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఏఆర్‌టీ సెంటర్ డాక్టర్ ఎం.గోవిందబాబు మాట్లాడుతూ హెచ్‌ఐవీ సోకకుండా అవగాహన కలిగి ఉండి జాగ్రత్తలు పాటించాలని, వ్యాధిగ్రస్తులు అధైర్య పడకుండా ఏఆర్‌టీ సెంటర్ ద్వారా మందులు సకాలంలో వాడి పౌష్టికాహారం తీసుకుంటే వ్యాధిని జయించవచ్చని అన్నారు. ప్యానల్ న్యాయవాది ఎస్.సుధీర్ మాట్లాడుతూ హెచ్‌ఐవీ వ్యాధిగ్రస్తులకు న్యాయపరమైన సహాయం అవసరమైతే మండల న్యాయ సేవా సంస్థ ద్వారా అందిస్తామన్నారు. అనంతరం వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం అందజేశారు. ప్యానల్ న్యాయవాదులు పి.అంబేడ్కర్, కె.జ్యోతి, వై.చిన్నారెడ్డి, ఏఆర్‌టీ సెంటర్ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

తండ్రి పేరిట సేవా ట్రస్ట్



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ

భీమవరం : సేవా కార్యక్రమాలు నిర్వహించడానికి తన తండ్రి దివంగత భూపతిరాజు సూర్యనారాయణరాజు పేరిట ప్రత్యేకంగా ట్రస్ట్ ఏర్పాటు చేస్తున్నట్టు కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ ప్రకటించారు. ఆదివారం సూర్యనారాయణరాజు సంస్మరణ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ సభ్యుడిగా తనకు వచ్చే ప్రయోజనాలను కూడా సేవా ట్రస్టు కోసం వినియోగిస్తామన్నారు. కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మంత్రి నిమ్మల రామానాయుడు, డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణంరాజు, ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్, పలువురు ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

306.2 మి.మీ వర్షపాతం

భీమవరం: జిల్లావ్యాప్తంగా ఆదివారం 306.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. అత్యధికంగా పాలకొల్లులో 28.6 మి.మీ నమోదు కాగా తాడేపల్లిగూడెంలో 11.6, పెంటపాడులో 10.8, తణుకులో 10.4, అత్తిలిలో 13.2, గణపవరంలో 8.4, ఆకివీడులో 8.4, ఉండిలో 7.6, పాలకోడేరులో 7.4, పెనుమంట్రలో 13.4 మి.మీ వర్షం కురిసింది. ఇరగవరంలో 17.8, పెనుగొండలో 20.2, ఆచంటలో 26.4, పోడూరులో 17, వీరవాసరంలో 10.8, భీమవరంలో 11.6, కాళ్లలో 12, మొగల్తూరులో 25.8, నరసాపురంలో 22.4, యలమంచిలిలో 22.4 మి.మీ వర్షపాతం నమోదైంది.

ఘనంగా రుద్రహోమం

తాడేపల్లిగూడెం (టీఓసీ) : తాడేపల్లిగూడెంలోని శంకరమఠంలో వేంచేసిన ఉమా చంద్రమౌళీశ్వర స్వామి సన్నిధిలో ఆదివారం రుద్రహోమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయంలో స్వామివారికి విశేష పూజలు, అమ్మవారికి కుంకుమార్చనలు జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

క్లుప్తంగా

మావుళ్లమ్మను దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి



మావుళ్లమ్మ సన్నిధిలో హైకోర్ట్ న్యాయమూర్తి జస్టిస్ వి.గోపాలకృష్ణ రావు దంపతులు

భీమవరం (ప్రకాశం చౌక్)/పాలకొల్లు సెంట్రల్: భీమవరం పట్టణ ఇలవేల్పు శ్రీ మావుళ్ళమ్మ అమ్మవారిని ఆంధ్రప్రదేశ్ హైకోర్ట్ న్యాయమూర్తి జస్టిస్ వి.గోపాలకృష్ణ రావు దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు మద్దిరాల మల్లికార్జున శర్మ పూజలు జరిపి వేద ఆశీర్వచనాలు అందించారు. ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్ శేష వస్త్రం, ప్రసాదాలు అందచేశారు. అమావాస్య సందర్భంగా అమ్మవారి దేవస్థానంలో చండీ హోమం నిర్వహించారు. శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామిని హైకోర్టు జడ్జి గోపాలకృష్ణారావు దంపతులు దర్శించుకుని ప్రత్యేక నిర్వహించారు.

అక్రమంగా కంకర తవ్వకాలు



కంకర లారీని స్వాధీనం చేసుకున్న రెవెన్యూ అధికారులు

ఉంగుటూరు: ఉంగుటూరు మండలం మెట్ట ప్రాంతంలో కంకర అక్రమ తవ్వకాలు జరుగుతున్నా చూసీ చూడనట్లు అధికారులు వ్యవహరిస్తున్నారు. చేబ్రోలు, నారాయణపురం, కంసాలిగుంట, గొల్లగూడెం, నల్లమాడు, కైకరం, ఉంగుటూరు, నాచుగుంట, వెల్లమిల్లి పంచాయతీ ఆయకట్టు ప్రాంతాలలో కంకర తవ్వి పట్టుకుపోతున్నారు. ఇరిగేషన్ అధికారులు తమ పని కాదన్నట్లు వ్యవహరిస్తున్నారు. తాడేపల్లిగూడెం మండలం కడియద్దకు చెందిన కంకర మాఫియా కంసాలిగుంట వద్ద కాలువ గట్టు ప్రాంతంలో తవ్వి లారీల్లో తరలిస్తుండగా ప్రజలు ఫిర్యాదు చేశారు. ఆదివారం తెల్లారుజామున కంసాలిగుంట వీఆర్వో, వీఆర్ఏలు కలిసి పట్టుకున్నారు. తహసీల్దారు కార్యాలయానికి తరలించారు. కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని తహసీల్దారు పూర్ణచంద్రప్రసాదు తెలిపారు.

మంగమ్మ తల్లిని దర్శించుకున్న భక్తులు

బుట్టాయగూడెం: కార్తీక మాసం చివరి ఆదివారం గుబ్బల మంగమ్మ తల్లి గుడికి భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచే భక్తులు భారీగా తరలి వచ్చి మంగమ్మతల్లిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాలతో పాటు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు దర్శనానికి వచ్చినట్లు ఆలయ కమిటీ నాయకులు, సర్పంచ్ కోర్స గంగరాజు తెలిపారు. ద్విచక్ర వాహనాలు, ఆటోలు, మినీ బస్సుల్లో భక్తులు తరలి వచ్చారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా స్థానిక పోలీసులు బందోబస్తు నిర్వహించారు. మర్లగూడెం అటవీ ప్రాంతంలో కొలువైన పాటమ్మతల్లిని, పసుపులమ్మ తల్లిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

● సహస్ర దీపాలంకరణ



మండవల్లిలోని శ్రీ విజయ దుర్గా అమ్మవారి ఆలయం వద్ద కార్తీకమాసం ముగింపు సందర్భంగా దీపాలంకరణ ఆకట్టుకుంది. ఆలయ అర్చకుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి సహస్ర దీపాలంకరణను కనుల పండువగా నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి దీపాలంకరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. మహిళలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ముందుగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. – మండవల్లి

● మానవత్వానికి ప్రశంసలు



పౌరుల్లో సేవాభావం పెంపొందించేందుకు మండవల్లి ఎస్సై తీసుకున్న చర్యలు అందరి ప్రశంసలు అందుకున్నాయి. నవంబరు 28న రాత్రి 8 గంటల సమయంలో లింగాలకు చెందిన కాటి నిరీక్షణబాబు కానుకొల్లు వద్ద బైక్ అదుపుతప్పి కిందపడ్డాడు. తలకి బలమైన గాయాలయ్యాయి. అదే సమయంలో మండవల్లి చెందిన ఎస్.రాజు, కె.శ్యామ్ కారులో కుటుంబ సభ్యులతో వస్తున్నారు. గాయపడ్డ వ్యక్తిని ఆస్పత్రికి తీసుకెళ్లాలని పోలీసులు అడగ్గా కుటుంబ సభ్యులను వేరే వాహనం ఎక్కించి బాధితుడిని గుడివాడ ఆస్పత్రిలో జాయిన్ చేయించారు. నిరీక్షణరావు ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. దీంతో మండవల్లి పోలీసులు, గ్రామస్తులు శ్యామ్‌ను, రాజును అభినందించారు. – మండవల్లి

● అలల ఉధృతి



ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో తీర ప్రాంతంలో అలలు ఉవ్వెత్తున ఎగిసిపడ్డాయి. నరసాపురం మండలంలోని వేములదీవి, తూర్పు తాళ్లు, పెదమైనవానిలంక, చినమైనవానిలంక గ్రామాల్లో అధికారులు తిరుగుతూ వాతావరణం అనుకూలించేవరకు వేటకు వెళ్లవద్దని సూచించారు. మరోవైపు తుఫాన్ ప్రభావంతో వీచిన గాలులకు మండలంలోని పలు గ్రామాల్లో వరి చేలు నేలకొరిగాయి. ఉదయం నుంచి వర్షం కురియడంతో రైతులు ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకునే పనులకు ఆటంకంగా మారింది. దీంతో ధాన్యం తడిసిపోయిందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈదురు గాలులు ఎక్కువగా ఉండటంతో చలి తీవ్రంగా ఉంది. – నరసాపురం రూరల్

అటకెక్కిన రీ సర్వే

- గత ఆరు నెలలుగా నిలిచిపోయిన రీ సర్వే
- గత ప్రభుత్వంలో రాష్ట్రంలో పశ్చిమ ప్రథమ స్థానం
- ముందుకు సాగని నాలుగో విడత సర్వే



తాడేపల్లిగూడెంలో భూముల రీ సర్వే చేస్తున్న సిబ్బంది (ఫైల్)

భీమవరం (ప్రకాశం చౌక్): గత ప్రభుత్వంలో భూముల రీ సర్వేలో జిల్లా రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో ఉండగా కూటమి ప్రభుత్వంలో భూముల రీ సర్వే పూర్తిగా నిలిచిపోయింది. ఈ ఆరు నెలల కాలంలో ఒక ఎకరా రీసర్వే జరగలేదు, ఒక్క రైతుకు భూ హక్కు పత్రం అందలేదు. రీ సర్వే జరిగిన రైతులకు సచివాలయంలో రిజిస్ట్రేషన్ కూడా చేయడం లేదు. గత ప్రభుత్వంలో మూడు దశల్లో భూముల రీ సర్వే పూర్తి చేశారు. ఈ ఏడాది జూన్ నుంచి నాలుగో విడత భూముల రీ సర్వే చేపట్టాలి. అయితే రీ సర్వేకు గ్రహణం పట్టింది.

మూడు దశల్లో 2.22 లక్షల ఎకరాల్లో రీ సర్వే

జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ భూములు 5.15 లక్షల ఎకరాలను రీసర్వే చేయాలనేది లక్ష్యంగా గత ప్రభుత్వం వైఎస్సార్ జగనన్న భూహక్కు, భూరక్ష పథకం అమలు చేసింది. గత ప్రభుత్వంలో మూడు దశల్లో 2,22,934 ఎకరాల్లో రీసర్వే పూర్తి చేశారు. 20 మండలాల్లో 174 గ్రామాల్లో రీ సర్వే జరిగింది. మరో 120 గ్రామాల్లోని 2,92,576 ఎకరాల్లో రీసర్వే చేయాల్సి ఉంది. 69,624 భూహక్కు పత్రాలను రైతులకు పంపిణీ చేశారు.

- ఫేజ్–1లో 16 మండలాలకు 16 గ్రామాల్లో పైలట్ ప్రాజెక్టుగా సర్వే చేపట్టారు. 6,177 మంది రైతులకు భూహక్కు పత్రాలు అందించారు.
- ఫేజ్–2లో 20 మండలాలకు 54 గ్రామాల్లో రీసర్వే చేపట్టి 57,206.78 ఎకరాల్లో రీ సర్వే పూర్తి చేశారు. ఈ ఫేజ్ లో 30,199 మంది రైతులకు భూహక్కు పత్రాలు అందించారు.
- ఫేజ్–3లో 20 మండలాల్లో 104 గ్రామాల్లో 1,56,208.27 ఎకరాల్లో సర్వే పూర్తి చేశారు. 33,248 మంది రైతులకు భూహక్కు పత్రాలు అందజేశారు. 1,15,354 సరిహద్దు రాళ్లను పాతించారు.

రీ సర్వే లక్ష్యం

98 ఏళ్లకు ముందు జరిగిన సర్వే ప్రకారం ఉన్న రికార్డుల సక్రమంగా లేకపోవడం, కొన్ని రికార్డులు లేకపోవడంతో భూ సమస్యలతో రైతులు సతమతం అవుతున్నారు. దీనిపై ఆలోచన చేసిన మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి భూముల రీసర్వే చేసి రికార్డులను ఆన్‌లైన్ చేసి రైతులకు ఇబ్బందులు లేకుండా వాస్తవ విస్తరణ, హద్దులతో భూమి రికార్డుల్లో పొందుపర్చడం లక్ష్యంగా ఈ పథకం అమలు చేశారు. ఈ పథకం ద్వారా రైతులు రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకూ ఖర్చు లేకుండా ఉచితంగా భూమి రీసర్వే చేసుకునే సౌలభ్యం కల్పించారు.

మూడు దశల్లో భూముల రీసర్వే వివరాలు

మండలం	గ్రామాలు	ఫేజ్–1(ఎకరాలు)	ఫేజ్ –2(ఎకరాలు)	ఫేజ్–3(ఎకరాలు)
ఆకివీడు	8	---	3,448.43	11,832.97
భీమవరం	6	548.89	2,244.32	7,532.13
గణపవరం	13	---	5,453.52	4,878.28
కాళ్ళ	8	493.60	5,138.24	7,701.88
పాలకోడేరు	12	---	4,704.87	13,071.38
ఉండి	14	713.01	2,378.73	16,845.21
వీరవాసరం	11	580.10	8,352.96	5,527.45
ఆచంట	4	390.02	---	4,591.74
యలమంచిలి	6	530.85	---	5,637.50
మొగల్తూరు	1	1,865.12	---	---
నర్సాపురం	7	883.16	---	6,717.27
పాలకొల్లు	6	405.77	2,228.42	3,452.89
పెనుగొండ	6	304.81	---	19,629.60
పెనుమంట్ర	6	304.51	---	6,659.57
పోడూరు	7	770.31	---	6,745.45
అత్తిలి	13	500.20	7,226.30	8,192.34
ఇరగవరం	14	290.71	---	9,224.97
పెంటపాడు	16	125.20	8,159.72	10,477.70
తాడేపల్లిగూడెం	8	---	6,690.55	11,967.23
తణుకు	3	768.81	1,180.68	1,790.50

నేత్రపర్వంగా సువర్చలా హనుమద్ కల్యాణం



సువర్చలా హనుమద్ కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు




కల్యాణ అలంకరణలో స్వామి, అమ్మవారు

జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలోని గురవాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామి క్షేత్రంలో కార్తీక మాసోత్సవాల్లో భాగంగా ఆదివారం సువర్చలా హనుమద్ కల్యాణం నేత్రపర్వంగా నిర్వహించారు. అర్చకులు, వేద పండితులు కల్యాణం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామి కల్యాణాన్ని వీక్షించారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. ఆదాయం రూ1,47,362 వచ్చినట్లు, ఆలయ సహాయ కమిషనర్ ఆర్‌వీ చందన తెలిపారు.

శ్రీవారి క్షేత్రంలో డ్రోన్ కలకలం

- డ్రోన్‌తో తీసిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్
- ఆలయ భద్రతా వైఫల్యంపై భక్తుల మండిపాటు



యూట్యూబర్ సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన డ్రోన్ విజువల్స్‌లోని ఫొటోలు

ద్వారకాతిరుమల: చిన వెంకన్న దివ్య క్షేత్రంలో ఆదివారం డ్రోన్ కలకలం రేగింది. ఒక యూట్యూబర్ డ్రోన్‌తో క్షేత్రంపై తీసిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. దీనిపై అలజడి రేగడంతో ఆ యూ ట్యూబర్ సోషల్ మీడియాలోని వీడియోలను తొలగించాడు. భద్రతా వైఫల్యం కారణంగానే ఈ ఘటన చోటుచేసుకుందని భక్తులు మండిపడుతున్నారు. ద్వారకాతిరుమలను ఈ ఏడాది ఆగస్టు నెలాఖరున ఒక యూట్యూబర్ సందర్శించాడు. పట్టపగలు ఆలయంపై డ్రోన్ ఎగురవేసి రాజగోపురాలు, కొండపైన, కొండ దిగువన, క్షేత్ర దేవత కుంకుళ్లమ్మ ఆలయం, పరిసర ప్రాంతాలను వీడియోలు తీశాడు. వాటిని సుమారు నెల క్రితం తన యూట్యూబ్ చానల్, సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. అవి వైరల్ కావడం వివాదానికి దారితీసింది. నిషేధిత ప్రాంతంలో డ్రోన్ ఎగురవేయడం ఏంటని విమర్శలు వచ్చిన నేపథ్యంలో రెవెన్యూ, పోలీస్ అధికారులు దీనిపై ప్రాథమిక విచారణ నిర్వహించారు. విషయం తెలుసుకున్న సదరు యూట్యూబర్ వెంటనే వీడియోలను తన యూట్యూబ్ చానల్, సోషల్ మీడియా అకౌంట్‌ల నుంచి తొలగించాడు.

మండిపడుతున్న భక్తులు

పట్టపగలు క్షేత్రంపై డ్రోన్ ఎగురుతుంటే ఆలయ అధికారులు, భద్రతా సిబ్బంది ఏం చేస్తున్నారని భక్తులు మండిపడుతున్నారు. డ్రోన్ కెమెరాలతో షూటింగ్ నిషేధమని క్షేత్రంలోని పలు ప్రాంతాల్లో సూచిక బోర్డులు ఏర్పాటు చేసిన దేవస్థానం అధికారులు.. డ్రోన్ ఎగురవేయడాన్ని నిలువరించలేకపోవడం గమనార్హం. ప్రధాన దేవాలయాల్లో ఒకటైన ఈ క్షేత్ర భద్రతపై సంబంధిత అధికారులు ఇంత అలసత్వం ప్రదర్శించడం సరికాదని భక్తులు ధ్వజమెత్తుతున్నారు. గత నెలలో శ్రీశైలం క్షేత్రంపై డ్రోన్ ఎగురవేసిన ఇద్దరు వ్యక్తులను సెక్యూరిటీ సిబ్బంది పట్టుకుని డ్రోన్‌తో సహా వారిని పోలీసులకు అప్పగించారు. ఇంత జరిగినా కనీసం దేవస్థానం అధికారులు గాని, భద్రతా సిబ్బంది గాని పోలీసులకు ఫిర్యాదు చేయకపోవడం గమనార్హం. దీనిపై ఆలయ ఈఓ ఎన్‌వీఎస్ఎన్ మూర్తిని వివరణ కోరగా, ఈ వీడియోలు ప్రైవేట్ భవనాల పైనుంచి తీసినవిగా తాము భావిస్తున్నామన్నారు.

కోళ్ల వ్యర్థాల వాహనం సీజ్

పెదపాడు: చేపల చెరువులకు కోళ్ల వ్యర్థాలను తరలిస్తున్న వాహనాన్ని పెదపాడు పోలీసులు సీజ్ చేసారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని గుడిపాడులో తనిఖీలు నిర్వహించగా వాహనంలో వ్యర్థాలు తరలిస్తున్నట్లు సమాచారం మేరకు వాహనాన్ని సీజ్ చేశారు. డ్రైవర్, వాహన యజమాని, చెరువు యజమానిపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటున్నట్లు పెదపాడు ఎస్సై కట్టా శారదా సతీష్ తెలిపారు. కోళ్ల వ్యర్థాలు తరలిస్తున్న సమాచారం తెలిస్తే 9440796637 నంబరుకు లేదా 112కు సమాచారం అందించాలని తెలిపారు.

ముగిసిన ఆట్యా-పాట్యా పోటీలు



ప్రథమ స్థానంలో నిలిచిన పల్నాడు మహిళల, పురుషుల జట్లు



ద్వితీయ స్థానంలో నిలిచిన పశ్చిమగోదావరి మహిళల, పురుషుల జట్లు

భీమవరం: భీమవరం ఎస్‌సీహెచ్‌బీఆర్ఎం హైస్కూల్లో రెండు రోజుల పాటు నిర్వహించిన 11వ సీనియర్ ఆట్యా-పాట్యా రాష్ట్ర స్థాయి చాంపియన్ షిప్ పోటీలు ఆదివారం ముగిశాయి. పోటీల్లో పల్నాడు జిల్లా మహిళలు, పురుష జట్లు ప్రథమ స్థానంలో నిలవగా పశ్చిమగోదావరి జిల్లా మహిళల, పురుషుల జట్లు ద్వితీయ స్థానంలో నిలిచాయి. డీఏన్నార్ కళాశాల ఉపాధ్యక్షుడు గోకరాజు పాండురంగరాజు బహుమతులు ప్రదానం చేశారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన 35 జట్ల క్రీడాకారులు పాల్గొన్న ఈ పోటీలు విజయవంతంగా నిర్వహించడం అభినందనీయమన్నారు.

ఉణుదుర్రు బాలికకు కరాటేలో స్వర్ణం

ఉండి: ఉండి మండలం ఉణుదుర్రుకు చెందిన దండే ప్రియకు కరాటే పోటీల్లో బంగారు పతకం లభించింది. బాలిక తల్లి రాజేశ్వరి తెలిపిన వివరాల ప్రకారం.. ప్రియ చినఅమిరం ఇమ్మానుయేలు చిల్డ్రన్ హోంలో 10వ తరగతి చదువుతుంది. మరో ముగ్గురు బాలికలతో కలిసి గత నెల 28న కరాటే పోటీల్లో పాల్గొనేందుకు మలేసియా వెళ్లింది. ఆదివారం జపాన్ బాలికతో జరిగిన పోటీలో విజయం సాధించడం ద్వారా ప్రియకు స్వర్ణపతకం లభించినట్లు ఆమె తల్లి తెలిపారు.

ఫెంగల్ తుఫాన్‌కు ఆక్వా హడల్



చేపల చెరువులో ఆక్సిజన్ సమస్య కారణంగా మరణించిన చేపలు (ఫైల్)



రొయ్యల చెరువులో ఆక్సిజన్ కోసం ఏరియేటర్లు

- వాతావరణ మార్పుతో పడిపోయిన ఉష్ణోగ్రతలు
- ఆక్సిజన్ కొరతతో మృత్యువాత పడుతున్న చేపలు
- చలి తీవ్రతతో రొయ్యల్లో వ్యాధులు

కైకలూరు/గణపవరం: బంగాళాఖాతంలో ఏర్పడిన ఫెంగల్ తుఫాన్ ప్రభావం ఆక్వా రంగంపై పడింది. చేపల చెరువుల్లో ఆక్సిజన్ సమస్య ఉత్పన్నమవుతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 2.80 లక్షల ఎకరాల విస్తీర్ణంలో చేపలు, రొయ్యల సాగు చేస్తున్నారు. వాతావరణ మార్పుల వల్ల రొయ్యల్లో వైరస్ వ్యాధులు రావడంతో కేవలం 30 రోజుల్లోనే పట్టుబడులు చేస్తున్నారు. దీంతో ఎకరానికి రూ.2 లక్షల నష్టం వాటిల్లుతోంది.

పడిపోయిన ఉష్ణోగ్రతలు..

సాధారణంగా రొయ్యల సాగుకు 34 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత అవసరం. వాతావరణ మార్పుల వల్ల ఆదివారం జిల్లాలో పలు ప్రాంతాల్లో పగలు 27 డిగ్రీల సెంటీగ్రేడ్, రాత్రి 23 డిగ్రీలకు ఉష్ణోగ్రత పడిపోయింది. ఈ ప్రభావంతో రొయ్యలు, చేపలు ఒత్తిడికి గురవుతాయి. ప్రధానంగా చల్లబడిన వాతావరణం ఒక్కసారిగా వేడెక్కితే కచ్చితంగా చేపల చెరువుల్లో ఆక్సిజన్ సమస్య బయటపడుతోంది. ఇప్పటికే ఆక్వా రైతులు ఈ ఏడాది వరదలకు జరిగిన నష్టాన్ని పూడ్చుకోవడానికి అప్పులు చేసి మరీ సాగు చేస్తున్నారు. ప్రస్తుత పరిస్థితిని చూసి ఆక్వా రైతులు బెంబేలెత్తిపోతున్నారు.

వెంటాడుతున్న వ్యాధులు

చలికాలం ఆక్వా రంగానికి గడ్డుకాలం. వైరల్, బ్యాక్టీరియా వ్యాధులు ఎక్కువగా సోకుతాయి. తుపానులు వచ్చినప్పుడు వాతావరణం ఒక్కసారిగా చల్లబడటం పెద్ద సమస్యగా మారుతోంది. రొయ్యల సాగులో వైట్ స్పాట్, ఈహెచ్‌పీ, రన్నింగ్ మోర్టాలిటీ, వైట్ ఫుట్, చేపల సాగులో ఆక్సిజన్ సమస్య, జలగ, శంఖు జలగ, తాటాకు తెగులు, పేను వంటి బ్యాక్టీరియా, ఫంగల్ వ్యాధులు వస్తున్నాయి. ప్రధానంగా చేపల చెరువుల్లో ఆక్సిజన్ సమస్య ఉత్పన్నమవుతోంది. ఈ సమస్య వల్ల ప్రతి ఏటా జిల్లాలో ఆక్వా రంగానికి రూ.90 కోట్ల నష్టం వాటిల్లుతోందని అంచనా. దాదాపు ఒక్కో వ్యాధి నివారణకు రూ.10 వేల నుంచి రూ.15 వేలు ఖర్చు చేయాల్సి వస్తోంది. రైతుల ఆందోళనను ఆసరాగా చేసుకుని ప్రైవేటు ఆక్వా ల్యాబ్‌లు, దుకాణాలు రైతులను మోసం చేస్తున్నాయి.

ఆక్సిజన్ సమస్య లక్షణాలు, నివారణను కైకలూరు మత్స్యశాఖ ల్యాబ్ ఏడీ బి.రాజ్‌కుమార్ వివరించారు.

ఆక్సిజన్ సమస్య లక్షణాలు

- చెరువుల్లో రోహు, కట్లా పెద్ద సైజు చేపలు అధికంగా మరణిస్తాయి.
- ప్రధానంగా మొప్ప వ్యాధి సోకిన చేపలు ఎక్కువగా మరణిస్తుంటాయి.
- ఉదయం చేపలు ఉపరితలం పైకి వచ్చి గాలి పీల్చుకుంటాయి.
- నీరు పచ్చగా మారి పులిసిన వాసన వస్తుంది.
- అడుగు భాగంలోని నత్తలు పైకి తేలుతాయి.

నివారణ మార్గాలు..

- ఆక్సిజన్ సమస్య ఉంటే మేతలు కట్టకూడదు.
- కాల్షియం హైడ్రాక్సైడ్ ఎకరానికి 2 కేజీలు చల్లాలి.
- సున్నం ఎకరానికి 25 కేజీలు పిచికారీ చేయాలి.
- ప్లాంక్టన్ ఉంటే సూపర్ ఫాస్ఫేట్ ఎకరానికి 25 కేజీలు చల్లాలి.
- ఆక్సిజన్ సమస్య తగ్గాక మేతలో మినరల్ మిక్చర్ కలిపి టన్ను మేతకు 1–15 కేజీల మినరల్ మిక్చర్ చల్లాలి.

క్లుప్తంగా

బెల్టు షాపు నిర్వాహకుడి అరెస్టు


బెల్టు షాపు నిర్వాహకుడిని అరెస్టు చేసిన సీఐ మణికంఠరెడ్డి

తణుకు అర్బన్: ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ అధికారులు ఆదివారం తణుకు మండలంలో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో బెల్టు షాపు నిర్వహిస్తున్న వేల్పూరు గ్రామానికి చెందిన తటవర్తి మల్లికార్జునరావును అరెస్టు చేసి 8 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ ఎస్.మణికంఠరెడ్డి తెలిపారు. బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ దాడుల్లో ఎస్సై బి.లక్ష్మి, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని పడాల జీవన సంధ్య వృద్ధాశ్రమంలో ఆదివారం బొలిశెట్టి శ్రీనివాస్ సేవా సమితి ఆధ్వర్యంలో పండ్లు పంపిణీ చేసి, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వాసవి ఇంజనీరింగ్ కళాశాల పాలక వర్గ చైర్మన్ గ్రంధి సత్యనారాయణ మాట్లాడుతూ పేదలు, వృద్ధుల ఆశీస్సులు సేవా సంస్థకు మెండుగా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బాబ్జీ, లింగం శ్రీనివాస్, మద్దాల నరసింహ, పొప్పొప్పుల త్రినాథ్ పాల్గొన్నారు.

సామాజిక స్పృహ కలిగిన వారే పాత్రికేయులు


మాట్లాడుతున్న వడ్డీ రఘురాం నాయుడు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రమాదం, ఇతర ఏ సహాయక చర్యలైనా చేపట్టేందుకు, ఆ విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే సామాజిక స్పృహ కలిగిన వారే పాత్రికేయులని వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్డీ రఘురాం నాయుడు అన్నారు. తాడేపల్లిగూడెం రూరల్ మండలం వెంకట్రామన్నగూడెం–తెలికిచర్ల రహదారిలో ఆదివారం ఏరియా ప్రెస్ క్లబ్ కార్తీక వన సమారాధన అత్యంత వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు ఆంజనేయులు, గొర్రెల శ్రీను, బీజేపీ నాయకులు ఈతకోట తాతాజీ, నరిస్సే సోమేశ్వరరావు, ప్రెస్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులు ఐక్యంగా ముందుకు సాగాలి


నరసాపురం మండల గ్రామ సచివాలయ ఉద్యోగుల సంఘ సభ్యులు

నరసాపురం రూరల్: గ్రామ, వార్డు సచివాలయాల సమస్యలను పరిష్కారం దిశగా ఉద్యోగులంతా ఐక్యంగా ముందుకు సాగుదామని సంఘ నాయకులు పలువురు పేర్కొన్నారు. నరసాపురం శ్రీవైఎన్ కళాశాల పీజీ సెమినార్ హాల్‌లో ఆదివారం నరసాపురం మండల గ్రామ సచివాలయ ఉద్యోగుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. అనంతరం నరసాపురం మండల గ్రామ సచివాలయ ఉద్యోగుల నూతన కార్యవర్గం ఏర్పాటు చేశారు. అధ్యక్షురాలిగా డాక్టర్ వీవీ లక్ష్మి, అసోసియేట్ అధ్యక్షురాలిగా డాక్టర్ వి.మౌనిక పెర్సిస్, పి.దుర్గా లక్ష్మీబాయి, ట్రెజరర్‌గా పులిపాక రవిప్రసాద్ తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఏపీజీఈఏ జిల్లా అధ్యక్షుడు జీఆర్ఎస్ఎన్ రాజు, అసోసియేషన్ ప్రెసిడెంట్ వై మోహనరావు, వైస్ ప్రెసిడెంట్ ఉమర్ అలీషా, కొప్పాడి శ్రీనివాస్, పులఖండం శ్రీనివాస్, పులిపాక రవిప్రసాద్ పాల్గొన్నారు.

స్వాములకు ఉచిత బిక్ష


బిక్షలో పాల్గొన్న స్వాములు

ఆకివీడు: మండలంలోని కుప్పనపూడి గ్రామ శివాలయంలో ముత్యాల రమాకాంతమ్మ, రత్నమాణిక్యం కమ్యూనిటీ హాలులో స్వాములకు ఉచిత బిక్ష నిరంతరం కొనసాగుతోంది. ఈ ఏడాది 75 రోజుల పాటు ఉచిత బిక్షను ప్రతీ రోజూ 300 నుంచి 500 మంది స్వాములకు అందజేస్తున్నట్లు నిర్వాహకులు, గురుస్వామి నూకల రామదాసు ఆదివారం తెలిపారు. అయ్యప్ప, భవానీ, శివ, గోవింద మాలాధారులు బిక్షకు హాజరవుతున్నారన్నారు. దాతల సహకారంతో ఉచితంగా ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజన సదుపాయం కల్పించామన్నారు. కార్యక్రమంలో స్వాములు, తదితరులు పాల్గొన్నారు.

ఆ మలుపు ప్రమాదాలకు పిలుపు

- డ్రెయిన్ మలుపు వద్ద మెస్ లేక ప్రమాదాలు
- మున్సిపల్ కార్యాలయం చెంతనే ఉన్నా పట్టించుకోని అధికారులు


డ్రెయిన్‌లో కంపాక్టర్ వాహనం (ఫైల్)


డ్రెయిన్ మలుపు వద్ద దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): మునిసిపల్ కార్యాలయం మీదుగా మసీద్ సెంటర్ వైపునకు తిరిగే రోడ్డు మలుపు వద్ద ప్రధాన డ్రెయిన్ ప్రమాదకరంగా మారింది. వన్ టౌన్‌లోని ఓవర్‌బ్రిడ్జి డౌన్ మెట్లు ల్యాండింగ్ సమీపంలో మునిసిపల్ కార్యాలయం మీదుగా ఉన్న ప్రధాన డ్రెయిన్‌కు రాడ్‌లను ఏర్పాటు చేసి మెస్‌ను నిర్మించే విషయాన్ని అధికారులు పట్టించుకోకపోవడంతో ఆ మార్గంలో ప్రయాణించే వారు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఈ డ్రెయిన్ మలుపు వద్ద ఎటువంటి మెస్ నిర్మించలేదు. తరుచుగా ప్రమాదాలు జరుగుతూ ఉండేవి. వర్షకాలంలో డ్రెయిన్, రోడ్డు మునిగిపోవడంతో ఎక్కడ డ్రెయిన్ ఉందో? ఎక్కడ రోడ్డు ఉందో వాహనదారులకు తెలిసేది కాదు. వర్షకాలంలో వాహనదారులు, పాదచారులు మలుపు వద్ద డ్రెయిన్‌లో పడకుండా ఉండేందుకు అప్పట్లో ఎర్రజెండాలను ఏర్పాటు చేసేవారు.

స్థానికులు నిర్మించుకున్నా..

గతంలో తరచూ ప్రమాదాలు జరగడంతో స్థానికులు అప్రమత్తమై వారి సౌజన్యంతో రూ.25 వేలు ఖర్చుపెట్టి కాంక్రీట్‌తో నాలుగు ఐరన్ పోల్స్ ఏర్పాటు చేసి ఇనుప అడ్డ బద్దెలతో మెస్ నిర్మించారు. ఈ మెస్ ఏర్పాట చేసినప్పటి నుంచి ఎలాంటి ప్రమాదాలు జరిగేవికాదు. వర్షకాలంలో సైతం ఈ మార్గంలో వాహనదారులు, పాదచారులు ప్రశాతంగా ప్రయాణించేవారు. అయితే డ్రెయిన్ సిల్ట్ తొలగించే క్రమంలో రాడ్‌లను, మెస్‌ను తొలగించా రు. ముఖ్యంగా రాడ్‌లను, మెస్‌ను, కాంక్రీట్‌ను పూర్తిగా తొలగించారు. దీంతో డ్రెయినేజీలో పెద్ద గొయ్యి ఏర్పడింది. అప్పటినుంచి వాహనదారులు, స్థానికులు బిక్కుబిక్కుమంటూ ప్రయాణిస్తున్నారు.

ప్రధాన డ్రెయిన్‌కు మెస్ ఏర్పాటు చేయాలి



ఓవర్ బ్రిడ్జి సమీపంలో మునిసిపల్ కార్యాలయం మీదుగా మసీద్ సెంటర్ వైపునకు తిరిగే రోడ్డు మలుపు వద్ద ప్రధాన డ్రెయిన్ మార్గానికి మెస్ ఏర్పాటు చేయాలి. గతంలో స్థానికులు వ్యయ ప్రయాసలతో ఏర్పాటు చేసిన, ఎంతో ఉపయుక్తంగా ఉన్న ఈ మెస్‌ను అనవసరంగా తొలగించారు. తిరిగి మెస్ ఏర్పాట చేస్తే, వాహనదారులకు, పాదచారులకు ఎటువంటి ఇబ్బంది ఉండదు. ఆ దిశగా అధికారులు చర్యలు చేయాలి.

– ఎస్.ఎం.సుభాని, స్థానికులు

మున్సిపల్ వాహనాలకూ ఇబ్బందే

ఇటీవల పురపాలక సంఘానికి చెందిన స్వచ్ఛ ఆంధ్ర మిషన్ కంపాక్టర్ వాహనం మలుపు తిరుగుతుండగా వెనుక టైర్లు డ్రెయిన్‌లో దిగబడ్డాయి. ఆ సమయంలో ఆ ప్రాంతంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. డ్రెయిన్ వద్ద కరెంట్ స్తంభాలు ఉన్నప్పటికి వాహనం వాటికి తగలకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. వాస్తవానికి ఈ మలుపు వద్ద డ్రెయిన్‌కు కల్వర్టు నిర్మించాల్సి ఉంది. అయితే ఈ దారిలో వాహనాలు తాకిడి ఎక్కువగా ఉండడంతో ఆ ప్రయత్నాలు ముందుకు సాగడం లేదు. పురపాలక సంఘం అధికారులు, సిబ్బంది తక్షణమే తిరిగి మలుపు వద్ద రక్షణ ఏర్పాట్లు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

సంచార వైద్యశాలలో ఏడుగురికి వైద్య సేవలు

తణుకు టౌన్: సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రతి ఆదివారం నిర్వహించే ఇంటింటికీ వైద్యసేవల కార్యక్రమంలో ఏడుగురు వృద్ధులకు వైద్య సేవలు అందించినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.కరుణాకర్ చౌదరి తెలిపారు. ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ హుస్సేన్ అహ్మద్, డాక్టర్ నిమ్మగడ్డ అచ్యుత రామయ్య, సుంకవల్లి నీలు మహేంద్ర ఆధ్వర్యంలో సంచార వైద్యశాల ద్వారా తణుకు పట్టణం, మండపాక గ్రామాల్లోని వివిధ ప్రాంతాల్లో మంచం నుంచి లేవలేని వృద్ధుల వద్దకు వెళ్లి అవసరమైన వైద్య పరీక్షలు చేసి సూచనలు, సలహాలు అందించారు. సంఘ సభ్యురాలు కాకర్ల సీతాలక్ష్మి ఆర్థిక సాయంతో మందులను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శి ఎండీ స్వాహాలిక, కోశాధికారి ఆర్‌జీ భాస్కరరావు, సభ్యులు గిరిజాల నాగేశ్వరరావు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా నిర్మల మాత ఉత్సవం

తణుకు టౌన్: పట్టణంలోని ఆర్‌సీఎం చర్చి ఆధ్వర్యంలో నిర్మలమాత ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఆర్‌సీఎం చర్చి ఆవరణలోని నిర్మల మాత ఉత్సవాల సందర్భంగా ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. అనంతరం రెవరెండ్ బాలరాజు ఆధ్వర్యంలో చర్చిలో ప్రార్థనలు నిర్వహించారు. ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ, దేవాలయ పెద్దలు విశ్వేశ్వరరావు, నందిన శేషు, సుద్దిల పాండు, మల్లిపూడి సురేష్, చదలవాడ నానీ, రాయుడు, పి.రామకృష్ణ, సంఘ విశ్వాసులు పాల్గొన్నారు.

హెచ్ఐవీ రోగులను ఆదరించాలి


ర్యాలీ నిర్వహిస్తున్న సేఫ్‌కేర్ సెంటర్, ఆస్పత్రి సిబ్బంది

తణుకు అర్బన్: హెచ్ఐవీ రోగుల పట్ల వివక్ష చూపరాదని, వారిని ఆదరించాలని తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రి డాక్టర్ కీర్తి అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ డే సందర్భంగా తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రి ఆవరణలోని సేఫ్ కేర్ సెంటర్ వద్ద ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హెచ్ఐవీపై ఆందోళన చెందనాల్సిన అవసరం లేదని క్రమం తప్పకుండా మందులు వాడితే వారి జీవితకాలం పెరుగుతుందన్నారు. అనంతరం హెచ్ఐవీ రోగులకు అందించిన సేవల్లో స్టేట్ బెస్ట్ అవార్డు అందుకున్న ఆస్పత్రి సిబ్బందితో పాటు జిల్లా అవార్డులు అందుకున్న ఉత్తమ కౌన్సెలర్ ఎ.శ్రీనాథ్, ఉత్తమ స్టాఫ్ నర్సు పి.సురేఖలను వైద్యులు, సిబ్బంది అభినందించారు. ముందుగా హెచ్ఐవీ నిరోధానికి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సేఫ్‌కేర్ సెంటర్ సిబ్బంది, ఐసీటీసీ సిబ్బంది, జిల్లా కేంద్ర ఆస్పత్రి సిబ్బంది, జెడ్పీ బాయ్స్ హైస్కూలు ఎన్‌సీసీ విద్యార్థులు, నర్సింగ్ విద్యార్థినులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీలు

తణుకు టౌన్: ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా వేల్పూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో పలు గ్రామాల్లో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఆదివారం తణుకు మండలంలోని వేల్పూరు, మండపాక, తేతలి, దువ్వ, ముద్దాపురం, కోనాల గ్రామాల్లో ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమాల్లో వేల్పూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సాయిభవాని, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డు అవసరం లేదనడం దారుణం


సమావేశంలో కార్మికులకు బేబీ కిట్లను అందజేస్తున్న దృశ్యం

తణుకు టౌన్: భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు అవసరం లేదని కార్మిక శాఖ మంత్రి శాసన సభలో అనడం దారుణమని ఏపీ భవన నిర్మాణ కార్మిక సంఘం వేల్పూరు గౌరవ అధ్యక్షుడు బళ్ల చిన వీరభద్రరావు అన్నారు. ఆదివారం తణుకు రూరల్ మండలం వేల్పూరు గ్రామంలో పార్వతి దేవి ఆలయంలో నిర్వహించిన భవన నిర్మాణ కార్మిక సంఘ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన వీరభద్రరావు మాట్లాడుతూ ప్రభుత్వం సంక్షేమ బోర్డులోని నిధులను ఇతర కార్యక్రమాలకు తరలించి భవన నిర్మాణ కార్మికులకు మొండి చేయిచూపిందన్నారు. ప్రభుత్వం ఏర్పడి 6 నెలలైనా ఎన్నికలలో ఇచ్చిన హామీలను ఇప్పటికీ అమలు చేయడం లేదన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న సంక్షేమ బోర్డును పరిరక్షించి వాటి ద్వారానే కార్మికుల సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. అనంతరం యూనియన్ సభ్యుల కుటుంబాల్లో ప్రసవం చేసుకున్న వారికి బేబీ కిట్లను అందజేశారు. వీరవల్లి వెంకన్న, వాటాల నాగేశ్వరరావు, సోరపల్లి రామకృష్ణ, గొల్లపల్లి రాజా, పి.పరమేశ్వరరావు, విప్పర్తి రవీంద్ర, జి.రాధాకృష్ణ, గరికిపాటి మహేష్ పాల్గొన్నారు.

మాలల సింహగర్జన మహాసభ విజయవంతం


అంబేద్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంగరాజు

తాడేపల్లిగూడెం (టీఓసీ): హైదరబాద్ జింఖానా గ్రౌండ్‌లో ఆదివారం జరిగిన మాలల సింహగర్జన మహాసభకు 5 లక్షల మంది మాలలు పాల్గొన్నారని, మహాసభ విజయవంతమైందని మాల మహానాడు జాతీయ అధ్యక్షులు చీకటిమిల్లి మంగరాజు హర్షం వ్యక్తం చేశారు. పట్టణంలో జరిగిన సమావేశంలో మంగరాజు మాట్లాడుతూ సభ విజయవంతం కావడంతోపాటు మాలల చైతన్యాన్ని చూసిన ఏపీ, తెలంగాణ ముఖ్యమంత్రుల వెన్నుల్లో వణుకు పడుతుందన్నారు. ఆర్టికల్ 341, 342లను సవరించే అధికారం పార్లమెంట్‌కు తప్ప దేనికి లేదన్నారు. రాష్ట్రాల్లో ఎస్సీ వర్గీకరణ చేయడానికి ప్రయత్నించడాన్ని తీవ్రంగా ఖండించారు. ఎస్సీ వర్గీకరణ కోసం నియమించిన ఏక సభ్య కమీషన్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు మహానందీ, పుష్పాంజలి, నర్సన్న తదితరులు పాల్గొన్నారు. తొలుత అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

పీహెచ్‌సీ వైద్యాధికారికి జిల్లా అవార్డు

ఉండి: మండల వైద్యాధికారి డాక్టర్ బి.సాయిచంద్రకు జిల్లా అవార్డు లభించింది. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రం భీమవరంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా అవార్డుకు ఎంపిక చేశారు. పీహెచ్‌సీ ద్వారా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ కార్యక్రమ నిర్వహణకు చేసిన విశిష్ట కృషికిగాను డాక్టర్‌తో పాటుగా ల్యాబ్ టెక్నీషియన్ పి.శ్రీదేవికి డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ మహేశ్వరరావు, అడిషినల్ డీఅండ్‌హెచ్ఓ భానునాయక్, ఏఆర్‌టీ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ గోవింద్‌బాబు సంయుక్తంగా అవార్డును అందజేశారు.

ఆత్మీయ కలయికకు వేదిక వనసమారాధన


మాజీ మంత్రి కారుమూరిని సత్కరిస్తున్న వర్తక సంఘ నాయకులు

తణుకు అర్బన్: స్నేహితులు, బంధువుల ఆత్మీయ కలయికకు కార్తీక వనసమారాధనలు వేదికలవుతున్నాయని మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకులో ఆదివారం కాపు సంక్షేమ సంఘం, యాదవ సంఘం, కిళ్లీ, సోడా అండ్ కూల్‌డ్రింక్స్ వర్తక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్తీక వనసమారాధన కార్యక్రమాల్లో కారుమూరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్తీకమాసంలో ఉసిరి చెట్టుకు పూజలు నిర్వహించి ఒకే వేదికపై అందరూ కలిసి భోజనం చేయడం ఆనవాయితీగా వస్తుందని స్పష్టం చేశారు. ముందుగా ఆయా సంఘాల ఆధ్వర్యంలో మాజీ మంత్రి కారుమూరిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ రుద్రా ధనరాజు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, మాజీ కౌన్సిలర్ యిండుగపల్లి బలరామకృష్ణ, పుల్లెపు సూర్యచంద్రరావు పాల్గొన్నారు.

షష్టి మహోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

తణుకు అర్బన్: అత్తిలి శ్రీవల్లీ దేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణ మహోత్సవ పోస్టర్‌ను మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఆదివారం తణుకులో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా షష్టి మహోత్సవాలకు హాజరై స్వామివారిని దర్శించుకోవాలని ఆలయ కమిటీ చైర్మన్ కురెళ్ల ఉమామహేశ్వరరావు, సభ్యులు కారుమూరికి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తణుకు నియోజకవర్గ ప్రజలకు సుబ్రహ్మణ్యేశ్వరుడు మంచి ఆయురారోగ్యాలు అందచేయాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు మద్దాల బాపిరాజు, బుద్దరాతి దొరబాబు, కురెళ్ల అయ్యప్ప పాల్గొన్నారు.

బోసిపోయిన పేరుపాలెం బీచ్


కేపీ పాలెంలో ఎగిసిపడుతున్న సముద్రపు అలలు

మొగల్తూరు: ఫెంగల్ తుఫాన్ కారణంగా భారీ వర్షాలు కురవడంతో పాటు సముద్రపు అలలు ఎగిసి పడతాయనే వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ఉన్నతాధికారులు ఆదేశాలు మేరకు ఆదివారం బీచ్‌లకు పర్యాటకులు రాకుండా నిషేధం విధించారు. ప్రతి ఏటా కార్తీక మాసం ఆది, బుధవారాలు సందర్శకులు బీచ్‌కు భారీగా తరలి వస్తారు. అయితే ఈ ఏడాది వాతావరణ అనుకూలించకపోవడంతో కార్తీకమాసం ఆఖరి ఆదివారం పర్యాటకులకు రాకను అధికారులు నిషేధించారు. దీంతో ప్రతి ఆదివారం సందడిగా ఉండే బీచ్ ప్రాంతం సందర్శకులు లేకపోవడంతో బోసిపోయింది. కేపీ పాలెం, పేరుపాలెం బీచ్‌లకు పర్యాటకులు రాకుండా పోలీసులు ఎక్కడికక్కడ వాహనాలు నిలిపివేయడంతో పాటు తీర ప్రాంతంలోకి ఎవరినీ అనుమతించలేదు. సీఐ దుర్గాప్రసాద్ నేతృత్వంలో ఎస్సై జి.వాసు పటిష్ట బందోబస్తును నిర్వహించారు.

తెగ తాగేస్తున్నారు


మద్యం స్టాకు

తాడేపల్లిగూడెం: కొత్త మద్యం పాలసీ అమలులోకి వచ్చిన తర్వాత రెండు నెలల కాలంలో ఏకంగా కోట్ల రూపాయల మద్యం తాగేశారు. తాడేపల్లిగూడెం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గూడెం పట్టణంలో ఉన్న 11 దుకాణాలు, గూడెం మండలంలో ఉన్న ఆరు షాపులు, పెంటపాడు మండలంలో ఉన్న ఎనిమిది దుకాణాలు, గణపవరంలో ఉన్న నాలుగు, అత్తిలిలో ఉన్న ఎనిమిది మద్యం దుకాణాలలో రెండు నెలల్లో అమ్మకాలు జోరుగానే సాగాయి. దుకాణం నిర్వహించే వ్యక్తి స్థాయి ఆధారంగా మూడు క్వార్టర్లు, ఆరు బీర్లు అన్నట్టుగా అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. ఒక్కో దుకాణంపై కనీసం రోజుకు లక్ష రూపాయలు దాటి అమ్మకాలు చేస్తున్నారు. కొన్ని దుకాణాలు మూడు లక్షల రూపాయల వరకు ఉన్నాయి. ఇన్‌వాయిస్ మీద మార్జిన్ల విషయంలో నవంబరు నెలాఖరు వరకు ప్రభుత్వానికి , మద్యం వ్యాపారులకు యుద్ధం సాగుతోంది. మద్యం దుకాణాలకు దరఖాస్తులు వేసే సమయంలో ఇన్‌వాయిస్ మీద 20 శాతం కమిషన్ ఇచ్చేలా మార్గదర్శకాల్లో ఉంది. తీరా దుకాణం ఓపెన్ చేశాక ఇన్‌వాయిస్ మీద 9 నుంచి పది శాతం మాత్రమే మార్జిన్ ఇస్తున్నారు. దీంతో ప్రభుత్వానికి వ్యతిరేకంగా రావులపాలేనికి చెందిన కొందరు వ్యాపారులు హైకోర్టును ఆశ్రయించారు. రాష్ట్ర మద్యం దుకాణాల అసోసియేషన్ పేరిట ప్రభుత్వానికి ఇన్‌వాయిస్‌పై మార్జిన్‌లను 20 శాతం అన్నట్టుగానే ఇవ్వాలని డిమాండ్లతో వినతి పత్రం అందజేశారు. వ్యవహారం వ్యాజ్యం వరకు వెళ్లడంతో ప్రభుత్వం దిగి వచ్చి డిసెంబర్ స్టాకు నుంచే మార్జిన్‌ను 20 శాతం ఇస్తారనే ప్రచారం సాగుతోంది.

రెండు నెలలు 36 కోట్ల రూపాయల మద్యం

సర్కిల్ పరిధిలో రెండు నెలల్లో 36 కోట్ల రూపాయలకు పైగా మద్యం విక్రయాలు సాగాయి. అక్టోబరులో 21244 బాటిళ్ల మద్యం(ఐఎంఎఫ్ఎల్), బీర్లు 6147 విక్రయాలు సాగాయి. వీటి విలువ 16 కోట్ల 19 లక్షల 99 వేల 208 రూపాయలు. నవంబరులో 28972 ఐఎంఎఫ్ఎల్ మద్యం అమ్మారు. బీర్లు 6811 అమ్మారు. వీటి విలువ 20 కోట్ల 63 లక్షల 24వేల 202 రూపాయలుగా ఉంది.

నూతన శోభతో సుబ్రహ్మణ్యేశ్వరుడి కల్యాణం

ఆకివీడు: స్థానిక పురాతన వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ పునఃప్రతిష్ఠ తరువాత వచ్చిన మొట్టమొదటి షష్టి ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు తెలిపారు. స్థానిక ఆలయ ప్రాంగణంలో ఆదివారం విలేకరుల సమావేశంలో కమిటీ అధ్యక్షుడు నేరెళ్ల రామకృష్ణ, ఏఎంసీ మాజీ చైర్మన్ మోటుపల్లి గంగాధరరావు, జగ్గరోతు విజయ్‌కుమార్, మన్నే పోతరాజు, రామశాస్త్రి, మోరా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ దాతల సహకారంతో ఆలయాన్ని నిర్మించామన్నారు. ఆలయ నిర్మాణానికి వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎల్ నర్సింహరాజు భూమి పూజ చేశారని చెప్పారు. అభివృద్ధి కమిటీ ఏర్పడి కమిటీ అధ్యక్షుడిగా నేరెళ్ల రామకృష్ణ వ్యవహరించి, ఆలయాన్ని సుందరంగా నిర్మించారు.

ఐదు రోజుల షష్టి

గతంలో ఒక్క రోజు మాత్రమే నిర్వహించే షష్టి ఉత్సవాలను ఐదు రోజులు నిర్వహించాలని ఆలయ అభివృద్ధి కమిటీ నిర్ణయించినట్లు తెలిపారు. ఆరో తేదీ ఉదయం గోపూజ, సాయంత్రం స్వామి వార్ల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహిస్తామన్నారు. ఏడో తేదీన అభిషేకాలు, తెప్పోత్సవం, అఖండ అన్నసమారాధన, ఎనిమిదో తేదీన వేలాయుధ పూజ, పవళింపు సేవ, తొమ్మిదో తేదీన స్వామి వారి గ్రామోత్సవం, పదో తేదీన స్వామి వారికి విశేష కావిడి ఉత్సవం నిర్వహిస్తామని తెలిపారు. ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. కార్యక్రమంలో మెప్మా అధ్యక్షురాలు మోరా జ్యోతిరెడ్డి, కుంకట్ల దానయ్య, సత్యనారాయణ, వాడపల్లి మోహన్, కుంచాడ బాబ్జీ, అర్చకులు రామకృష్ణ,పాల్గొన్నారు.

ఏడున తల్లిదండ్రుల సమావేశం

ఆకివీడు: ఈ నెల 7వ తేదీన అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో తల్లిదండ్రుల మెగా సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ ఏ.రవీంద్ర ఆదివారం తెలిపారు. అదే రోజు విద్యార్థుల హోలిస్టిక్ ప్రోగెస్ కార్డులను విడుదల చేస్తారన్నారు. విద్యార్థుల హాజరు, విద్యా ప్రమాణాలు, సామర్థ్యం, లోటు పాట్లు, వెనుకబాటుతనం, విద్యార్థుల ఆరోగ్య రిపోర్టు, ఆటలు, పాటలు తదితర అంశాలతో కూడిన హోలిస్టిక్ ప్రోగెస్ కార్డులు తల్లిదండ్రులకు ఇచ్చి సమగ్ర పరిశీలన చేస్తారని చెప్పారు. విద్యార్థుల్లో విద్యా నైపుణ్యాలు పెంపొందిస్తామన్నారు.

ఉత్సాహంగా కార్తీక వనసమారాధనలు


ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్‌ను సత్కరిస్తున్న సంఘ నాయకులు

తణుకు టౌన్: కార్తీకమాసం ఆఖరి ఆదివారం కావడంతో తణుకు ప్రాంతంలో కార్తీక వనసమారాధనలు ఉత్సాహంగా నిర్వహించారు. తణుకు పట్టణంలోని సజ్జాపురం అండర్ పాస్ వద్ద కాపు ఐక్యవేదిక, కొండాలమ్మ పుంత రోడ్డులో యాదవ సంఘం, కమ్మ కల్యాణ మండపంలో కమ్మ సంఘం రాజుల కల్యాణ మండపంలో విశ్వ బ్రాహ్మణ సంఘం, తణుకు మండలం వేల్పూరులో బాలాజీ నగర్ తదితర చోట్ల పలు సంఘాలు ఏర్పాటు చేసిన కార్తీక వన భోజన కార్యక్రమాల్లో ఆయా సంఘాలు ఉత్సాహంగా పాల్గొన్నారు. చిన్నారుల ఆట పాటలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

వర్షంతో ఫంక్షన్స్ హాల్స్‌లోనే

ఫెంగల్ తుఫాన్ ప్రభావం కార్తీక వనసమారాధనలపై ప్రభావం చూపింది. కార్తీకమాసంలో పలు ఆలయాల వద్ద, తోటల్లో వనసమారాధనలు నిర్వహిస్తారు. అయితే తణుకు పరిసర ప్రాంతాల్లో శుక్ర, శనివారాల్లో కురిసిన వర్షం కారణంగా తోటలు బురదగా మారడంతో పట్టణంలోని పలు కల్యాణ మండపాల్లో కార్తీక వనసమారాధనలు ఏర్పాటు చేశారు. తణుకు విశ్వ బ్రాహ్మణ సంఘం, తణుకు కమ్మ సంఘం కార్తీక వన సమారాధన కార్యక్రమాలు కల్యాణ మండపాల్లోనే నిర్వహించారు. వీటితో పాటు తణుకు సజ్జాపురంలో తణుకు నియోజవకర్గ స్థాయిలో కాపు సంఘం ఆధ్వర్యంలో కార్తీక మన సమారాధనలు నిర్వహించారు. ఈ వనసమారాధనల్లో ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్, ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ, మాజీ మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరారావు, కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు తదితరులను సత్కరించారు. కార్యక్రమంలో కాపు ఐక్యవేదిక నాయకులు రావి శ్రీనివాసు, కాకిలేటి హరినాథ్, జిల్లా కాపు సంఘం అధ్యక్షుడు చినిమిల్లి రాయుడు, తణుకు నియోజవకర్గ కాపు సంఘం అధ్యక్షుడు అద్దాల అనంతబాబు, పట్టణ అధ్యక్షుడు వంటెద్దు ఈశ్వర ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.